బాలమిత్ర, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## గృహప్రవేశం

ఒకసారి బాబా వద్దకు ఓ దంపతులు వచ్చి "బాబా! మేము మీ భక్తులము. మీరే మా ఇలవేల్పుగా భావిస్తూ, పూజిస్తూ వస్తున్నాము. ఇన్నాళ్ళకు ఇలా మీ దర్శనభాగ్యం కలిగింది" అంటూ బాబా పాదాలను తాకి పూలూ, పళ్ళూ, దక్షిణ సమర్పించి, "బాబా, మీ కృపవలన మేము స్వగృహం కట్టుకున్నాము. మీరు 'గృహప్రవేశం' సమయానికి తప్పక రావాలి" అంటూ ప్రాధేయపడ్డారు.

దానికి బాబా "నా భక్తులకు అండగా, నీడగా, సలహాదారునిగా నేనెప్పుడూ వుంటాను. మీరింతగా ప్రాధేయపడాలా? తప్పకుండా మీ ఇంటి గృహప్రవేశానికి వస్తాను. చాలా?" అంటూ అభయమిచ్చి దీవించాడు. ఆ తర్వాత వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ తర్వాత కొన్నాళ్ళకు ఆ దంపతులు గృహప్రవేశ కార్యక్రమాలు ముగించి, కొత్తింటికి చేరి, అటు తర్వాత మళ్ళీ బాబా వద్దకు వచ్చారు. ఆ రోజు బాబా దగ్గర చాలామంది భక్తులు చేరివున్నారు. బాబా వారికి సూక్తులు బోధిస్తున్నారు. అంతలో బాబా వారిని చూసి, "కుశలమా? ఏంటి, చాలా దుఃఖితులై నన్ను ప్రశ్నించ వచ్చినట్లున్నారు!" అంటూ అడిగారు చిరునవ్వుతో.

"బాబా మీరు మాటిచ్చి తప్పారు. మా యింటి గృహప్రవేశానికి తప్పకుండా వస్తానని చెప్పి, రాలేదు. మాకు చాలా బాధనిపించింది. ఎలాగో ఆ కార్యక్రమం అయిందనిపించుకుని వెంటనే మీదగ్గరికి వచ్చాము. మా వలన పొరపాటు జరిగిందా? మా భక్తిశ్రద్ధతలలో లోపం కనిపించిందా? ఎంచేత మీరు రాలేదు బాబా?" అంటూ ఎంతగానో బాధపడిపోతూ, ప్రాధేయపడుతూ అడిగారు బాబాని.

దానికి బాబా "నేను ఆడితప్పే వాడిని కాదు. ఒకసారి మాటిచ్చానంటే అది ఎట్టి పరిస్థితిల్లోనూ తప్పను. నేను వచ్చాను. ఆరంభంలోనే వచ్చి, పూర్తి అయ్యేవరకు ఉండి మరీ వెళ్ళాను. మీరే గుర్తించలేదేమో చూసుకోండి!" అంటూ సవినయంగా చెప్పారు.

ఆ సమాధానానికి ఆ దంతపులతో సహా అందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ రోజు గురుపూర్ణిమ. బాబా ఎక్కడికీ కదలలేదని ఇక్కడి భక్తులందరికీ తెలుసు. అక్కడ అగుపించక బాబా రాలేదని ఆ దంపతులకీ తెలుసు. అయినా ఆ చిదంబర రహస్యమేమిటో ఎవరికీ అర్థంకాలేదు.

ఆ తర్వాత ఆలోచించినమీదట, ఆ దంపతులు ఇంటికి వెళ్ళి గృహప్రవేశ సమయాన తీయించిన ఫోటోలు కడిగించి చూడగా, అన్ని ఫోటోల్లోను, బాబా అందరి మధ్యలో కూర్చుని ఆశీర్వదిస్తూ ఉండడం కనిపించింది. అది చూసిన ఆ దంపతులు ఆనందభరితులై "అయ్యో బాబాని నిందించామే" అని తలచి, విలపించి, వాటితో సహా బాబాని చేరి క్షమించమని పాదాలపై పడి ప్రాధేయపడ్డారు.

ఆ ఫోటోలు చూసిన అందరూ ఆశ్చర్యపోయారు. బాబా చిరునవ్వుతో అందరినీ ఆశీర్వదించారు.